పేదల చదువుకు భరోసా

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్/నరసన్నపేట/పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం బలోపేతానికి చేపడుతున్న పథకాలు పేద విద్యార్థుల చదువులకు చక్కని భరోసా కల్పిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి అన్నారు. ఆమదాలవలస పట్టణంలో గల శారదా కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా ప్రతిభా పురస్కారాలు, నగదు ప్రోత్సాహకాలు గురువారం స్పీకర్ అందజేశారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాల సత్కార కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని పాతటప్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించినవారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు. ఇంటర్‌మీడియెట్‌లో మొదటి మూడుస్థానాలు సాధించిన వారికి రూ.15 వేలు చొప్పున అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాతపట్నం: టెన్త్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన మిట్టు మహాపాత్రో, ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, తల్లిదండ్రులకు సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

క్లుప్తంగా

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు



బొడ్డపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

బూర్జ: ఇంటింటికీ స్వచ్ఛమైన జలాన్ని అందించాలన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనా విధానాన్ని ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అమలుచేస్తున్నారని వైకుంఠపురం పంచాయతీ సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం అన్నారు. వైకుంఠపురం పంచాయతీలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిల పనులు పూర్తయిన సందర్భంగా బొడ్డపాడు గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ట్రయిల్ రన్ కూడా చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి



నియామకపత్రం అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస నియోజకవర్గంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలుగా నియామకమై వారికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం నియామక పత్రాలను అందజేశారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని, చిన్నారులను తమ సొంత పిల్లలుగా గుర్తించి ఆలన, విద్యాభ్యాసం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఐసీడీఎస్ పీఓ కె.బాలామణి, వైఎస్సార్‌సీపీ నాయకులు దుంపల శ్యామలరావు, జేకే వెంకటేశ్వరులు, దుంపల చిరంజీవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలో కట్యాచార్యులపేటలో పల్లెబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మహిళల కోసం ఆసరా, చేయూత, అమ్మ ఒడి, ఇళ్ల పట్టాల మంజూరు, గృహ నిర్మాణాలు, స్వయంశక్తి సంఘాల రుణమాఫీ వంటివి అమలు చేయడం జరుగుతుందన్నారు. సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, సచివాలయాల మండల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, పార్టీ నాయకులు తిర్లంగి రామారావు, చిగురుపల్లి దశరథ, తమ్మినేని వేణు, గురుగుబెల్లి చంద్రయ్య, చేపాన కృష్ణ, కూటికుప్పల సన్యాసిరావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



విత్తనాల నిల్వలను పరిశీలిస్తున్న చేస్తున్న ఏఓ

నరసన్నపేట: ఎరువుల డీలర్లు ఇష్టానుసారంగా విత్తనాలు విక్రయాలు చేస్తున్నారని, రైతులకు బిల్లులు కూడా ఇవ్వడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, నిబంధనలను అతిక్ర మించి విత్తనాలు విక్రయించేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ కె.సునీత హెచ్చరించారు. నరసన్నపేటలోని పలు విత్తన దుకాణాల్లో గురువారం తనిఖీలు చేపట్టారు. విత్తనాల శ్యాంపిల్స్ తీశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని సూచించారు.

విద్యార్థులందరికీ జేవీకే కిట్లు అందజేయాలి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేయాలని ఎంఈఓ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో సీఆర్పీలతో గురువారం సమావేశం అయ్యారు. విద్యా కానుక కిట్లు పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎంత మంది విద్యార్థులకు కిట్లు అవసరమో తెలియజేయాలన్నారు. పాఠశాలల్లో మిగిలిన కిట్లును అవసరం ఉన్న చోటకు సరఫరా చేయాలన్నారు. పాఠ్యపుస్తకాలు పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె.ఉపేంద్ర ఉన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

- ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం
- పురుషోత్తపురం రోడ్డులో తరచూ ప్రమాదాలు



పురుషోత్తపురం అవధానుల చెరువు వద్ద కూలిన కల్వర్టు



పొన్నాంపేట్ట వద్ద ప్రమాదకరంగా రహదారి మలుపు

సరుబుజ్జిలి/ఆమదాలవలసరూరల్: మలుపుల వద్ద కనీసం స్పీడు బేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసే దాఖలాలు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఏమాత్రం వాహనం వచ్చి తాకినా కూలిపోయేందుకు కల్వర్టులు, రక్షణ గోడలు సిద్ధంగా ఉన్నాయి. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది.

రహదారుల విస్తరణ ఇలా..

ఆమదాలవలస నియోజకవర్గంలో రొట్టవలస నుంచి ఆమదాలవలస వరకు గల ఆర్‌అండ్‌బీ రహదారి 16 కిలో మీటర్లు మేర విస్తరించి ఉంది. ఈ రహదారిలో రొట్టవలస, పాలవలస, రావివలస, వెంకటాపురం, పురుషోత్తపురం, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట, చెవ్వాకులపేట, రామచంద్రాపురం, ఆనందపురం, పొన్నాంపేట, చిట్టివలస గ్రామస్థులు ప్రతీ రోజూ ప్రయాణాలు చేస్తుంటారు. రొట్టవలస నుంచి పురుషోత్తపురం వరకు 5 కిలో మీటర్ల రహదారిలో సుమారు 6 ప్రమాదకర మలుపులు, 3 బ్రిడ్జీల వద్ద రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదస్థితిలో దర్శనమిస్తున్నాయి. చెవ్వాకులపేట నుంచి పొన్నాంపేట వరకు గల 3 కిలోమీటర్ల మేర ప్రమాదకరమైన మలుపులున్నాయి. ఈ విషయమై పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు ప్రమాదాల గురించి ఫిర్యాదు చేసినా సమస్యకు పరిష్కారం చూపలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకొంటాం..

నియోజకవర్గంలోని పలుచోట్ల ప్రమాదాలు జరుగుతున్న ప్రమాదాలు. మలుపుల విషయం గురించి ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కె.జాన్ సుధాకర్ వద్ద ప్రస్తావించగా.. శిథిలమైన కల్వర్టులు, రక్షణగోడలు, మలుపుల గురించి ఇంతవరకు తన దృష్టికి రాలేదన్నారు. వెంటనే ఆర్‌అండ్‌బీ శాఖ కింది స్థాయి అధికారుల ద్వారా తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకొంటామని వెల్లడించారు.

గతకొన్ని సంవత్సరాలుగా జరిగిన రోడ్డు ప్రమాదాలు..

- తాజాగా పురుషోత్తపురం గ్రామం సమీపంలోని అవధానుల చెరువు వద్ద శిథిలమైన కల్వర్టుకు ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని బోల్తాపడి పలువురు విద్యార్థులు గాయాలతో బయటపడ్డారు.
- ఇదే కల్వర్టు వద్ద మూడు నెలల క్రితం ద్విచక్ర వాహనం, ట్రాక్టర్‌కు ఢీకొన్న ఘటనలో గుత్తావల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు మృతి చెందాడు.
- యరగాం -పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్ వద్ద ఓ వ్యక్తి వాహనం అదుపుతప్పి కాలువలో పడి తీవ్రగాయాల పాలయ్యాడు.
- రామచంద్రాపురం మలుపు వద్ద 3 ఏళ్ల క్రితం ఎదురెదురు వాహనాలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు.
- పొన్నాంపేట మలుపుల్లో ఏడాది కాలంగా సుమారు 30 మంది వాహనదారులు గాయాలపాలయ్యారు.
- పాలవలస సమీపంలో మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.
- రావివలస సమీపంలో మలుపు వద్ద లగేజీ వ్యానుపై నుంచి జారిపడి ఒకరు మృతి చెందారు.

విద్యాకానుకల పంపిణీ



మెళియాపుట్టి: జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి



జలుమూరు: జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేస్తున్న రామకృష్ణ, తదితరులు

మెళియాపుట్టి: ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల వైపు చూసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో మండలానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును గురువారం పంపిణీ చేశారు. నాడు–నేడుతో సర్కారు పాఠశాలల రూపురేఖలను మార్చి ఏకైక సీఎం జగన్ అని అన్నారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాల పేరిట సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. జీసీడీఓ నీరజ, ఎంఈఓ దేవేంద్రరావు, ఏపీఎం లలిత, జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్, శశిభూషణరావు, తేజారావు, జయమునిరావు, ఎల్.సంజీవరావు, మారం ఫల్గుణరావు, బొంతు రవి, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

జలుమూరు: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు భోజనం, పుస్తకాలు, దుస్తులు, బూట్లు, మౌలిక వసతులతో కూడిన విద్యా బోధన సాగుతోందని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అల్లాడపేట పేరెంట్స్ కమిటీ చైర్మన్ కల్యాణం రామకృష్ణ అన్నారు. విద్యార్థులకు జగనన్న కిట్లు గురువారం పంపిణీ చేశారు. అనంతరం కొత్త అడ్మిషన్లపై విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. హెచ్‌ఎం అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్యాణం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక రచనలను ప్రోత్సహించాలి

పొందూరు: ఆధ్యాత్మిక రచనలను ప్రభుత్వాలు, రచయితలు ప్రోత్సహించాలని ప్రముఖ రచయిత, విశ్రాంత రీడర్ అల్లంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో సత్యసాయి మందిరంలో రచయిత ఉరిటి మురళీమోహన్ పట్నాయక్ రచించిన తిరుమల వేంకటేశ్వర శతకం పుస్తకావిష్కరణలో గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటువంటి రచనలకు ఆర్థిక సహకారాన్ని, ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందించాలని కోరారు. అనంతరం రచిత మురళీమోహన్ పట్నాయక్‌ను సన్మానించారు. పెద్దలు వాండ్రంగి కొండలరావు, నానాజీ, భాస్కరరావు, దామోదరరావు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ఉత్తమ విద్యాబోధన

హిరమండలం: కేజీబీవీల్లో ఉత్తమ విద్యాబోధనతోపాటు వసతులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మురళి సూచించారు. స్థానిక కేజీబీవీలో ప్రత్యేకాధికారి కష్టవేణి ఆధ్వర్యంలో విద్యార్థినులకు జగనన్న విద్యాకానుక కిట్లను గురువారం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో కేజీబీవీ ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఇదంతా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కృషి ఫలితమేనన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వనిత, శైలజ, ప్రవల్లిక, వైష్ణవికి నగదు బహుమతులు అందించారు. అనంతరం జీవీకే కిట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, సర్పంచ్ సుందరమ్మ, వి.బాలరాజు, ఆనందరావు, సురేష్ పాల్గొన్నారు.

అద్దె బకాయి చెల్లించాలి

కొత్తూరు: మండలం పీఏసీఎస్‌కు చెందిన గొడౌన్‌కు సంబంధించిన అద్దె బకాయి చెల్లించాలని కోరుతూ ఎంపీడీవో ఎం.పావనికి సంఘం సీఈఓ కృష్ణారావు గురువారం నోటీస్ అందజేశారు. ఆదరణ పథకం సామగ్రిని నిల్వ చేసేందుకు 2018లో గొడౌన్‌ను ఎంపీడీఓ కార్యాలయం అధికారులు అద్దెకు తీసుకున్నారన్నారు. ఇంతవరకు అడ్వాన్స్‌గా రూ.10 వేలు, అద్దె రూ.40 వేలు చెల్లించారని నోటీస్‌లో పేర్కొన్నారు.

బకాయి ఉన్న 55 నెలల అద్దె రూ.5.50 లక్షలు చెల్లించాలని, లేకపోతే గొడౌన్‌ను ఖాళీ చేయాలని కోరుతూ నోటీస్ అందజేశారు. నోటీస్‌కు స్పందించకపోతే టెక్కలి డీఎల్‌సీఓ కోర్టులో కేసు వేస్తామన్నారు.

సంక్షిప్తంగా..

46 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం

సారవకోట: మండలంలోని 46 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగినట్లు ఎంఈఓ ఎం.వి. రమణ గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో కొంత ఉపాధ్యాయులు ఇతర మండలాల నుంచి మండలానికి వచ్చారన్నారు. మరికొంత మంది మండలంలోని ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

పాతపట్నం: జగనన్నకి చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సరైన పరిష్కారం వచ్చేలా మండల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. 1920కి ఫోన్ చేసి సమస్యలు చెబితే ఆయా శాఖల అధికారులు స్పందించాలన్నారు. సమస్యలపై లబ్ధిదారులు సంతృప్తి పడేలా ఉండాలన్నారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఎస్ఐ మహమ్మద్‌యాసీన్, డీటీ ప్రసాదరావు, వైద్యుడు శ్రీధర్ పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

జలుమూరు: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు మరింత మెరుగ్గా సేవలు అందించాలని ఎంపీడీఓ ఐ.వి.అప్పారావు అన్నారు. జలుమూరు సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఉద్యోగుల హాజరు పరిశీలించారు. పెండింగ్ అర్జీలు ఎన్ని ఉన్నాయో చూసి త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూరు: ఉపాధి పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని వైస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు అన్నారు. మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీలో గురువారం వేతనదారులకు గునపాలను పంపిణీ చేశారు. బత్రి శ్రీనివాసరావు, ఉర్జాన కళావతి, షణ్ముఖరావు, సురవరపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వే వేగవంతం చేయాలి

మెళియాపుట్టి: స్వమిత్వ సర్వే వల్ల శాశ్వత భూపరిష్కారాలు జరుగుతాయని డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని కార్యదర్శులతో గురువారం సమీక్షించారు. స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని, తద్వారా గ్రామాల్లో ఉన్న గ్రామకంఠం, దేవాలయాల భూములు, చర్చిలు తదితర ప్రదేశాల్లో సర్వే నిర్వహించాలన్నారు. కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించి, కచ్చితత్వమైన రికార్డులను తయారుచేయాలన్నారు. గ్రామీణ ప్రజలకు వారి నివాస ఆస్తులను డాక్యుమెంట్ చేసే హక్కును అందించడం స్వామిత్వ సర్వే లక్ష్యమన్నారు. దశలవారిగా మరింత పురోగతి సాధించాలన్నారు. ఈ నెల 16న టెక్కలి ప్రాంతీయ ఆస్పత్రిలో నిర్వహించనున్న రక్తదానం కార్యక్రమానికి మండలం నుంచి అధికసంఖ్యలో దాతలు హాజరయ్యేలా చూడాలన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఏఓ తిరుపతి పట్నాయక్, ఈఓపీఆర్డీ తారకేశ్వరి పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకోండి

పోలాకి: మండల కేంద్రానికి అనుకుని సర్వే నంబర్–1లో గంగివలస, పోలాకి అనుబంధ రెవెన్యూ పరిధిలోని ఉన్న మహదేవబందలో మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని కొండలక్కివలస గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు పూర్తిగా ధ్వంసం అయిపోతుందని, వర్షాకాలంలో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటపాటలతో విద్యాబోధన

పాతపట్నం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని పాతపట్నం సెక్టర్ పీఓ టి.విమలారాణి అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రంలో జన్‌భాగీదారి కార్యక్రమం గురువారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆటపాటలతో విద్యబోధన నేర్పిస్తున్నామన్నారు. కేంద్రంలోని పలు రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీలో ఉత్తమ విద్యాబోధన

హిరమండలం: ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులతోపాటు సాంకేతిక, వొకేషనల్ గ్రూపులు అందుబాటులో ఉన్నట్టు హిరమండలం ప్రభుత్వ జూనియర్ కాలేజీ సిబ్బంది తెలిపారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లోని మోదుగువలస, స్కాట్‌పేట, రావిచెంద్రి, చింతలబడవంజ, కరకవలస, పాతహిరమండలం తదితర గ్రామాలను సందర్శించారు. పదో తరగతి పాసైన విద్యార్థులను కలిశారు. కాలేజీలో అందుబాటులో ఉన్న కోర్సులతో పాటు సదుపాయాలు, రాయితీలను వివరించారు. కాలేజీలో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

హిరమండలం: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ రాంబాబు అన్నారు. కల్లట, అవలంగిలో గురువారం పర్యటించారు. స్థానిక ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు, అమ్మఒడి, మధ్యాహ్న భోజనం, ఇంగ్లిష్ మీడియం బోధన, నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ వెంట కల్లట హెచ్‌ఎం అన్నాజీరావు, లచ్చయ్య పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు చేరిన వరి విత్తనాలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు వరి విత్తనాలు వచ్చాయని ఏఓ పైడి లతశ్రీ గురువారం తెలిపారు. ఇప్పటికే పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లించిన రైతులకు విత్తనాలు సరఫరా చేస్తామన్నారు. విత్తనాలు కావాలనుకుంటే ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని ఆర్‌బీకేలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. విత్తనాలు, ఎరువులు కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెళియాపుట్టి: ఈ నెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ వి.ఎ.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్‌లో తీగలకు ఆనుకుని ఉన్న చెట్టుకొమ్మలను తొలగిస్తామన్నారు. మెళియాపుట్టి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

19 నుంచి డిగ్రీ అడ్మిషన్లు

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరేందుకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ప్రక్రియను ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.రామరావు గురువారం తెలిపారు. ఈ నెల 24 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాలలో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. కళాశాలలో అత్యున్నత విద్యార్హత కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు.

సీఎం జగన్‌తో అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



పోలాకి: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



హిరమండలం: చొర్లంగిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పోలాకి: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో స్థానిక సర్పంచ్ బెండి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమించి సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు కొనసాగుతున్నమని గుర్తుచేశారు. చంద్రబాబు కుట్రలతో, దత్త పుత్రుడు పవన్, సొంత పుత్రుడు లోకేష్, పాతమిత్రులు, రాజకీయ రాబందులు ఎంతమంది వచ్చినా సీఎం జగన్‌ను ఎదుర్కోవటం వారి తరం కాదని తేల్చిచెప్పారు. మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, ఏఎంసీ చైర్మెన్ దుంపల భాస్కరరావు, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, నాయకులు పాలిన కృష్ణమూర్తి, దుర్రు అచ్చెయ్య, సుంకరి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం హామీల అమలు

హిరమండలం: శతశాతం హామీలను అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. చొర్లంగిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, పౌరసేవలు, మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. అర్హులైన వారికి రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని గుర్తుచేశారు. ఎక్కడైనా అర్హులకు పథకాలు అందకుంటే వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పారదర్శకంగా పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాతపట్నం నియోజకవర్గానికి జగన్ అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, ఆనందరావు, సురేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.